లక్క పట్టివేత

నిందితులతో అటవీ శాఖ అధికారులు

వేమనపల్లి, డిసెంబర్ 1 : అక్రమంగా బొలేరో వాహనంలో లక్కను తరలిస్తున్నారనే సమాచారంతో అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. కుష్టపల్లి ఫారెస్ట్ రేంజర్ దయాకర్ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం దహెగాం మండలంలోని మొట్ట గూడెం రాంపూర్ నుంచి బొలేరో వాహనంలో అక్రమంగా లక్క తరలిస్తున్నారనే సమాచారం రావడంతో వెంటనే వేమనపల్లి అటవీ సెక్షన్ కార్యాలయం నుంచి డీఆర్వో రూపేశ్, ఎఫ్ఎస్వో బేగ్, ఎఫ్బీవో సతియా బేగం, బేస్ క్యాంపు సిబ్బందితో కలిసి కల్లెంపల్లిలోని రహదారి వద్ద పట్టుకున్నారు. క్వింటాల్ లక్కతో పాటు నిందితులను పట్టుకుని విచారించారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని భూపాలపట్నానికి చెందిన జెన్న వెంకటేశ్వర్లు , పవనూరి సత్యనారాయణ, దుర్గం సత్యనారాయణ దహెగాం మండలంలోని మొట్లగూడెంరాంపురం గ్రామానికి సెడ్మక సుధాకర్‌తో లక్క సేకరణ కోసం సంప్రదించారు. సుధాకర్ చెన్నూర్‌కు చెందిన దిండు చిరంజీవి, కోటపల్లి మండలానికి ఎలివేశ్వరం మహేశ్‌తో కలిసి కొంత మంది కూలీలతో వారి ద్వారా లక్క సేకరిస్తున్నట్లు తెలిపారు. కూలీలకు కిలో లక్కకు రూ. 300 చొప్పున చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. లక్కను చత్తీస్‌గఢ్‌కు తీసుకువెళ్లి అక్కడ ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం లక్కను తీసుకుని వాహనంలో వెళ్తుండగా ఐదుగురు నిందితులు చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని భూపాలపట్నానికి చెందిన జెన్న వెంకటేశ్వర్లు , పవనూరి సత్యనారాయణ, దుర్గం సత్యనారాయణ, చెన్నూరు గ్రామానికి చెందిన దిండు చిరంజీవి, కోటపల్లి మండలానికి ఎలివేశ్వరం మహేశ్‌ను పట్టుకోగా మరో నిందితుడు దహెగాం మండలంలోని మొట్ల గూడెంరాంపురానికి చెందిన సెడ్మక సుధాకర్ పరారైనట్లు తెలిపారు. సుధాకర్ బైక్‌తో పాటు బొలేరో వాహనం, నిందితులను కుష్టపల్లి రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. పట్టుకున్న లక్క విలువ రూ. 80 వేలు ఉంటుందని తెలిపారు. ఎవరైనా అక్రమంగా అటవీ సంపదను దోచుకున్నా, వన్య ప్రాణులను హతమార్చినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వ్యాన్ ఢీకొని ఒకరి మృతి

జైనూర్, డిసెంబర్ 1 : మండలంలోని రాశిమెట్ట గ్రామంలో టాటా మ్యాజిక్ వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. ఎస్ఐ డీ సాగర్ తెలిపిన వివరాల ప్రకారం జైనూర్ మండలంలోని రాశిమెట్ట గ్రామానికి చెందిన మెస్రం జైవంత్‌రావ్ (47) శనివారం రాత్రి తన పొలానికి వెళ్లి వచ్చి ఎడ్లను రోడ్డు పక్కన కడుతుండగా కెరమెరి వైపు నుంచి వస్తున్న టాటా మ్యాజిక్ వాహన డ్రైవర్ నిర్లక్ష్యంతో అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. డ్రైవర్‌ను వెంబడించి పట్టుకున్నారు. తీవ్ర గాయలైన జైవంత్‌రావను దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. మృతుడి కొడుకు రాము ఫిర్యాదు మేరకు డైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డీ సాగర్ తెలిపారు.

బైక్ ఢీ కొని ఒకరికి గాయాలు

కౌటాల, డిసెంబర్ 1 : మండలంలోని తలోడి గ్రామానికి చెందిన పెద్దపల్లి యాదవ్ ఇంటి దగ్గరలో రోడ్డు దాటుతుండగా కౌటాల నుంచి కోర్సినికి మోటర్ సైకిల్‌పై వెళ్తున్న కుడిపే మారుతి అనే వ్యక్తి అతివేగంగా గుద్దడంతో యాదవ్ కాలు విరిగింది. వెంటనే దవాఖానకు తరలించారు. కుడిపే మారుతి అతిగా మద్యం తాగి ఉన్నట్లు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి, మారుతిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

మహిళ అదృశ్యం

జైనూర్ ,డిసెంబర్ 01 : జాతకాలు చెప్పేందుకు ఈ నెల 29న జైనూర్‌కు వచ్చిన నిర్మల్ జిల్లా గోసంపల్లికి చెందిన గడ్డం లక్ష్మి(41) అదృశ్యంపై ఫిర్యాదు అందినట్లు జైనూర్ డీ.సాగర్ తెలిపారు. జైనూర్‌కు చెందిన మండడి రాజుపై అనుమానం ఉన్నట్లు తల్లి గడ్డం ఎల్లమ్మ ఫిర్యాదు చేయడం మిస్సింగ్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

తాండూర్, డిసెంబర్ 1 : కుటుంబ కలహాల నేపథ్యంలో ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన తాండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. రాజీవ్‌నగర్ గ్రామానికి చెందిన వరాల అనిల్‌కు మాదారం టౌన్‌షిప్‌కు చెందిన ఓ అమ్మాయితో వివాహం జరిగింది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆదివారం సాయంత్రం తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

దుప్పట్లు పంపిణీ

కాసిపేట, డిసెంబర్ 1 : కాసిపేట మండలంలోని గట్రావ్‌పల్లిలో ఆదివారం ముత్యంపల్లికి చెందిన మంద ఐలయ్య తన కూతురు పుట్టిన రోజు సందర్భంగా 100 మంది పేదలకు దుప్పట్లు , పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో మాజీ సర్పంచ్ పెంద్రం రాజు, మాజీ కో ఆప్షన్ మెంబర్ సిరాజ్ ఖాన్, మెరుగు శంకర్ పాల్గొన్నారు.

'చలో బస్‌భవన్'ను విజయవంతం చేయాలి

మంచిర్యాలటౌన్, డిసెంబర్ 1: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలు టీజీఎస్ఆర్టీసీ జేఏసీ ఈ నెల 5న ఇచ్చిన చలో బస్‌భవన్ కార్యక్రమాన్ని ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు విజయవంతం చేయాలని మంచిర్యాల డిపో ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి, జేఏసీ డిపో కన్వీనర్ గోలి శంకర్ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలని, వెల్ఫేర్ కమిటీలను రద్దు చేయాలని, సంపూర్ణ ఆరోగ్య భద్రతను ప్రకటించాలని డిమాండ్ చేశారు. బస్సుల్లో టికెట్ తీసుకునే బాధ్యతను పూర్తిగా ప్రయాణికుడికే చేయాలని, మహాలక్ష్మి స్కీంలో మహిళలకు ఫ్రీ జర్నీ పాసులను అందజేయాలని, 2021 వేతన సవరణ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా చేయాలని, ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీకి సబ్సిడీతో ఇవ్వాలని, మహిళా ఉద్యోగులందరికీ రాత్రి 8గంటల లోపు ముగిసే డ్యూటీలను కేటాయించాలని, రిటైర్డ్ ఉద్యోగులందరికీ అన్ని రకాల సెటిల్మెంట్‌లు వెంటనే చేయాలని, పెంచిన పనివారాలు తగ్గించాలని, కొత్త బస్సులను కొనుగోలు చేసి ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 5న చలో భవన్ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కార్యవర్గం ఎన్నిక

లక్షెట్టిపేట, డిసెంబర్ 1 : లక్షెట్టిపేట మండల ప్లంబర్ అండ్ ఎలక్ట్రీషియన్ కార్యవర్గాన్ని పట్టణంలోని గురునానక్ ఫంక్షన్‌హాలులో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా అబ్దుల్ సహీ, ప్రధానకార్యదర్శిగా మేడి నరేష్, ఉపాధ్యక్షులుగా దేవి రాజేందర్, పంతం వెంకటేశ్వర్లు, ఉప కార్యదర్శిగా ఎండీ మొహురొద్దీన్, గళ్ల మధూకర్‌ను ఎన్నుకున్నారు. వీరితో పాటు మరికొంత మందిని కార్యదర్శ సభ్యులుగా ఎన్నుకున్నారు. వీరికి సలహాదారుగా తాటిపల్లి నిరంజన్‌చారి, అశోక్‌కుమార్‌ను నియమించారు. ఈ ఎన్నికలు సంఘం జిల్లా అధ్యక్షుడు పొట్టాల మల్లేశ్, ప్రధాన కార్యదర్శి అట్ల ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించగా ఎండీ, ఖాజా, మాజిత్‌ఖాన్, రాజేందర్, కనకరాజు, రామకృష్ణ, హిత్మత్‌సింగ్, సాయికృష్ణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు.

వేంపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం

హాజీపూర్, డిసెంబర్ 1 : మండలంలోని వేంపల్లి గ్రామంలో ఆదివారం లయన్స్ క్లబ్ మంచిర్యాల, లయన్స్ క్లబ్ గోల్డెన్ జూబ్లీ ఆధ్వర్యంలో ఉచిత కంటి, సాధారణ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ప్రోగ్రాం చైర్మన్‌గా మాజీ ఎంపీటీసీ డేగ బాపు వ్యహరించారు. వైద్యులు చంద్రత్, సురేశ్, నిశాంత్ జనరల్ మెడిసిన్, న్యూరో, దంత పరీక్షలు నిర్వహించగా స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఇందులో 25 మందికి కంటి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించగా పలువురికి వైద్య పరీక్షల అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో లయన్స్ క్లబ్ సభ్యులు బాల్‌మోహన్, రామాంజనేయులు, వినయ్‌కుమార్, గుండా శ్రీనివాస్‌తో పాటు సభ్యులు, గ్రామస్తులున్నారు.

టీపీఎల్ ప్రీమియర్ లీగ్ ఆక్షన్‌ను ప్రారంభం

తాండూర్, డిసెంబర్ 1 : తాండూర్ సర్కిల్ కార్యాలయం ఆవరణలోని మైదానంలోఆదివారం తాండూర్ సీఐ కే కుమారస్వామి తాండూర్ ప్రీమియం లీగ్ (టీపీఎల్)క్రికెట్ టోర్నమెంట్ ఆక్షన్ (క్రీడాకారుల వేలం పాట)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ క్రీడాకారులు క్రికెట్ టోర్నమెంటును జాతీయ భావంగా తీసుకొని ఆడాలన్నారు. క్రీడాకారులకు, టీం లకు పోటీల్లో గెలుపోటములు సహజమన్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో, స్నేహపూర్వకంగా, సమన్వయంతో ఆటల్లో రాణించాలన్నారు. క్రికెట్ పోటీలను నిర్వాహకులు గొడవలకు తావివ్వకుండా సజావుగా నిర్వహించాలని కోరారు. ఈ ప్రీమియర్ లీగ్‌లో తాండూర్ మండలానికి చెందిన 10 టీంలు పాల్గొంటాయని, టీపీఎల్ లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న 172 మంది క్రీడాకారులను ఆక్షన్ ద్వారా వివిధ టీంలు దక్కించుకుంటాయని నిర్వాహకులు తెలిపారు. ఇందులో ఎండీ అలీం ప్లేయర్‌ను అత్యధికంగా వేలం పాడి సహనా ట్రేడర్స్ వారు దక్కించుకున్నారు. రెండు రోజుల్లో టీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాదారం ఎస్ఐ బీ సౌజన్య, నిర్వాహకులు మైదం అనిల్‌కుమార్, మసాడి శశివర్ధన్, సాలిగామ శివ, అలీమ్‌ఖాన్, మిట్ట వెంకటస్వామి, సహన కిరణ్, సల్మాన్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

తాండూర్ లారీ అసోసియేషన్ కార్యవర్గం

తాండూర్, డిసెంబర్ 1 : తాండూర్ లారీ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇందూరి మల్లయ్య, ఉపాధ్యక్షుడిగా కామెర మహేందర్, జనరల్ సెక్రటరీ కౌటం తిరుపతి, జాయింట్ సెక్రటరీ పురంశెట్టి కిరణ్‌కుమార్, క్యాషియర్ బట్టి ప్రకాశ్, సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం వీరిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ప్రారంభం

నస్పూర్, డిసెంబర్ 1 : మంచిర్యాలలోని ఏసీసీలోని ఉషోదయ హైస్కూల్‌లో ఆదివారం 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలను మంచిర్యాల జిల్లా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రారంభించారు.

నూతన ఆవిష్కరణల కోసం కృషి చేయాలి

నస్పూర్, డిసెంబర్ 1 : విద్యార్థులు నూతన ఆవిష్కరణలు రూపొందించేందుకు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మంచిర్యాలలోని ట్రినిటీ పాఠశాలలో నిర్వహిస్తున్న విజ్ఞాన శాస్త్ర మేళా ఆదివారం ముగిసింది. ఇందులో 15 మంది విజేతలుగా నిలువగా జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ అతిథిగా హాజరై బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో యాదయ్య, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, ప్రిన్సిపాల్ థామస్, న్యాయ నిర్ణేత శ్రీనివాస్, ఎంఈవో మాళవికా దేవి, సెక్టోరల్ అధికారులు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేతకు ఘన నివాళి

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 1: మంచిర్యాల జిల్లా సీపీఐ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ ఎన్ బాల మల్లేశ్ అకాల మరణాన్ని చింతిస్తూ వారి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఖలిందర్ అలీ ఖాన్, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగం రవి, జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌల్, సిరికొండ రాయలింగు, నర్సయ్య పాల్గొన్నారు.

సింహగర్జన సభకు తరలిన మాలలు

నమస్తే నెట్‌వర్క్, డిసెంబర్ 1 : హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర మాల సంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన 'హలో మాల చలో హైదరాబాద్' సింహ గర్జనకు మంచిర్యాల, కుమ్ర భీం ఆసిఫాబాద్ జిల్లాల్లోని అన్ని మండలాల నుంచి మాల కులస్తులు తరలివెళ్లారు. జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులు, వాహనాల్లో పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

వైద్యుడి ఇంట్లో చోరీ

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 1: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో గల వైద్యుడు విజయబాబు ఇంట్లో చోరీ జరిగిన ఘటన వెలుగు చూసింది. వైద్యుడు కుటుంబంతో శనివారం రాత్రి ఓ ఫంక్షన్‌కు వెళ్లాడు. అర్ధరాత్రి తర్వాత తిరిగి ఇంటికి వచ్చి బెడ్ రూం డోర్ ఓపెన్ చేయగా ఓపెన్ కాలేది. ఆదివారం ఉదయం డోర్‌ను తెరిచి చూడగా కబోర్డ్‌లో ఉన్న నగదు, బంగారం ఎవరో ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. వేసిన తాళాలు వేసినట్లే ఉండడంతో తెలిసిన వారే చోరీకి పాల్పడినట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయంపై సీఐ ప్రమోద్ రావును వివరణ కోరగా దొంగతనం వాస్తవమేనని తెలిపారు.

రాత్రి పూట అకారణంగా బయట తిరగొద్దు

- 'ఆపరేషన్ చబుత్రా'లో ఏసీపీ వెంకటేశ్వర్లు

శ్రీరాంపూర్, డిసెంబర్ 1 : రాత్రి వేళల్లో అకారణంగా బయట తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం రాత్రి శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్ఐ సంతోష్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ కాలనీలో ప్రధాన ఏరియాల్లో పోలీస్ ఆపరేషన్ చబుత్ర తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్లు పాల్గొని తనిఖీ చేశారు. తనిఖీల్లో అనుమతి పత్రాలు లేని 40 మోటార్ సైకిళ్లు, ఆరుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు, ఏడుగురిపై బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారు పట్టుబడినట్లు తెలిపారు. నంబర్ ప్లేట్లు సరిగా లేని నాలుగు బైక్‌లను పట్టుకున్నట్లు తెలిపారు. అనంతరం వాహనదారులతో శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్లో సమావేశం నిర్వహించారు. అనుమతి పత్రాలు లేని వాహనాలు నడపడం నేరమన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి

శ్రీరాంపూర్‌లో మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

ప్రజలకు ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు. పెతా కార్యక్రమంలో ఎస్ఐ శ్రీధర్, లక్ష్మీప్రసన్న, నాగరాజు, పోలీసులు పాల్గొన్నారు.

భీమారం పోలీస్ స్టేషన్ తనిఖీ

భీమారం, డిసెంబర్ 1 : భీమారం పోలీస్ స్టేషన్‌ను జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డులను పరిశీలించారు. ఇక్కడి నుంచి బదిలీపై వెళ్తున్న సిబ్బంది పున్నం, చంద్రమోహన్, సంపూర్ణను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సర్కిల్ సీఐ వేణుచందర్, ఎస్ఐ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిలో ఆపరేషన్ చబుతా..

మందమర్రి, డిసెంబర్ 1: యువకులు అర్ధరాత్రి అకారణంగా రోడ్ల పై కనిపిస్తే చర్యలు తప్పవని మందమర్రి సీఐ శశీధర్ రెడ్డి హెచ్చరించారు. మందమర్రి సర్కిల్ పరిధిలోని ఐదుగురు ఎస్ఐలు, 25 మంది సిబ్బందితో దు పెట్రోలింగ్ బృందాలుగా ఏర్పడి శనివారం అర్ధరాత్రి పట్టణంలో ఆపరేషన్ చబుత్ర కార్యక్రమంలో భాగంగా తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా అనవసరంగా తిరుగుతున్న 35 మందిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు. వారి నుంచి 15 బైక్‌లు, కారు ను స్వాధీనం చేసుకున్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు లు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్ఐ రాజశేఖర్, అదనపు ఎస్ఐ శ్రీనివాస్, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్, రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తదితరులున్నారు

అంకితభావంతో విధులు నిర్వహించాలి

మందమర్రి, డిసెంబర్ 1: అంకిత భావంతో విధులను నిర్వహించాలని తమ పరిధిలో ప్రజలకు సేవలందించాలని బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ సూచించారు. ఇటీవల శిక్షణ పూర్తి చేసుకుని రామగుండం సీపీ ఆదేశాల మేరకు మందమర్రి పోలీస్ స్టేషన్‌కు కేటాయించిన 23 మంది కొత్త కానిస్టేబుళ్లకు ఆదివారం మందమర్రి సర్కిల్ కార్యాలయంలో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ శశీధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్, రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తదితరులున్నారు.

బెల్లంపల్లి, డిసెంబర్ 1 : విధుల్లో చేరిన పోలీసులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఏసీపీ రవికుమార్ తెలిపారు. బెల్లంపల్లి రూరల్ సర్కిల్, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 26 మంది నూతన కానిస్టేబుళ్లకు రూరల్ సీఐ కార్యాలయంలో నిర్వహించిన పరిచయ కార్యక్రమంలో ఏసీపీ మాట్లాడారు.

మందమర్రిలో కొత్త కానిస్టేబుళ్లకు సూచనలిస్తున్న బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, వన్‌టౌన్ సీఐ దేవయ్య, టూటౌన్, తాళ్లగురిజాల, నెన్నెల ఎస్ఐలు మహేందర్, రమేశ్, ప్రసాద్ ఉన్నారు.

జాతీయ గీతాలాపనలో పాల్గొన్న సినీ నటుడు

జాతీయ గీతాలాపన చేస్తున్న సినీ నటుడు ఆనంద్ భారతి

బెల్లంపల్లి, డిసెంబర్ 1 : జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహిస్తున్న నిత్య జనగణమన జాతీయ గీతాలాపన కార్యక్రమంలో ఆదివారం సినీ నటుడు ఆనంద్ భారతి(అఖండ-2, ఆది, ఇడియట్, అమ్మనాన్న ఓ తమిళమ్మాయి)ఫేమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో జాతీయ భావాన్ని పెంపొందించేందుకు జాతీయ గీతాలాపన కార్యక్రమం నిత్యం నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఘనంగా ఐఆర్‌సీఎస్ వార్షికోత్సవం

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 1: మంచిర్యాల జిల్లా ఇంటియన్ రెడ్ క్రాస్ సొసైటీ 16వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. రక్తనిధి కేంద్రంలో సేవలను అందిస్తున్న వైద్యులకు, సిబ్బందికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జల్లా చైర్మన్ మాట్లాడుతూ జిల్లా పోలీస్, బెటాలియన్, సీఐఎస్ఎఫ్, రెవెన్యూ, వైద్య, రవాణా, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవల ఆధ్వర్యంలో 1240 క్యాంపులను నిర్వహించి 1,01,559 యూనిట్ల రక్తాన్ని, 695 ప్లేట్‌లెట్స్‌ను సేకరించినట్లు తెలిపారు.

డీసీఎం వ్యాన్‌ను అడ్డుకున్న గ్రామస్తులు

మందమర్రి రూరల్, డిసెంబర్ 1: మందమర్రి మండలం మామిడిగట్టు గ్రామం మీదుగా ఫర్నిచర్, ఇంటి సామగ్రితో వెళ్తున్న డీసీఎం వ్యాను ఆదివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. సరైన పత్రాలు లేకుండానే అటవీశాఖ అధికారిణి అద్దె ఇంటికి సామగ్రిని తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని డిప్యూటీ రేంజ్ అధికారి సంతోష్ కు సమాచారం అందడంతో అక్కడి చేరుకుని డీసీఎం వ్యాను మంచిర్యాల అటవీశాఖ కార్యాలయానికి తరలించి విచారణ చేపట్టారు.ఈ విషయమై డీఎఫ్వో రత్నాకర్ రావు ను వివరణ కోరగా సామగ్రికి సంబంధించి పర్మిట్లు ఉండడంతో వ్యాన్‌ను పంపించినట్లు తెలిపారు.

'ట్రాన్స్ మహిళా మనులు' పుస్తకావిష్కరణ

కాగజ్‌నగర్, డిసెంబర్ 1: కాగజ్‌నగర్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో రచయిత నాగిల్ల రవీందర్ రచించిన 'ట్రాన్స్ మహిళ మణులు' అనే పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. చైతన్య సాహితి వేదిక ఆధ్వర్యంలో పుస్తకాన్ని ఆవిష్కరించిన ఆనంతరం పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు మేడి చరణ్‌దాస్, మహిపాల్, యుఎన్ చారీ, రాజకమలాకర్‌రెడ్డి, రాజన్న, కటుకం మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తిర్యాణి,డిసెంబర్ 1 భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కుమ్రం భీం కమ్యూనిటీ భవనంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. 60ఏళ్లు పైబడిన కార్మికులకు నెలకు రూ.6వేలు పించన్ ఇవ్వాలని, కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులకు రాష్ట్ర స్థాయి సలహా బోర్డులో సభ్యులుగా నియమించాలని, గతంలో పెండింగ్‌లో ఉన్న పింఛన్, ఇతర బెనిఫిట్ బకాయిలను వెంటనే ఇవ్వాలని, కార్మికుల అడ్డాల వద్ద ప్రధాన మౌలిక వసతులు కల్పించాలని, ప్రమాదంలో మరణించిన కార్మిక కుటుంబానికి రూ.10లక్షలు సహజ మరణం పొందితే రూ.5లక్షలు ఇవ్వాలని, తంబ్ ఇంప్రెషన్‌ను తొలగించి పాత పద్ధతిలో కార్మికులకు కార్డులివ్వాలని, అర్హులైన కార్మికులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవాలని, రేషన్ కార్డులు ఇవ్వాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో తొలి ప్రాధాన్యమివ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సింగం మొగిళి గౌడ్, మండలాధ్యక్షుడు కినక జంగు, కార్యదర్శి దేవేందర్, సీనియర్ నాయకులు సత్తయ్య, శంకర్, హరీశ్, తిరుపతి తదితరులున్నారు.

దహెగాం అధ్యాపకుడికి జ్ఞాననంది అవార్డు

దహెగాం, డిసెంబర్ 1 : దహెగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుడు నోముల చంద్రశేఖర్‌కు జ్ఞాననంది ఉత్తమ ఆదర్శ ఉపాధ్యాయ అవార్డును పొందాడు. ఉత్తమ బోధనతో పాటు తాను చేస్తున్న సాహిత్య ఆధ్యాత్మిక సేవలకు గుర్తింపుగా లెర్నింగ్ ఇంటర్ నేషనల్ సమస్త ఆధ్వర్యంలో ఆదివారం సికింద్రాబాద్‌లోని త్యాగరాయ గానసభ కళానిలయంలో ఏర్పాటు చేసిన అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో అధ్యాపకులు నోముల చంద్రశేఖర్‌కు అవార్డు అందజేశారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక

చింతలమానేపల్లి, డిసెంబర్ 1 : మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి యువ సంఘటన స్కూల్లో ఆదివారం జరిగిన నెట్‌బాల్ అండర్-14 (బాలురు) పోటీల్లో చింతలమానేపల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌కే యూ అయాన్, ఈ. బన్నీ (7వ తరగతి) ఎంపికైనట్లు పీడీ హరీశ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 6,7,8వ తేదీల్లో కరీంనగర్‌లో జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పీడీ హరీశ్, ఎంఈవో అభినందించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

చింతలమానేపల్లి, డిసెంబర్ 1 : మెనూ ప్రకారం భోజనం అందించాలని అధికారులు, సిబ్బందిని ఎంఈవో జయరాజ్, ఎంపీవో సుధాకర్ రెడ్డి ఆదేశించారు. చింతల మానేపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల పాఠశాలను ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పాటు పాఠశాల గదులు, వంట గది, కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెద్దపులి సంచారంపై అప్రమత్తంగా ఉండాలి

వాంకిడి, డిసెంబర్ 1: మండలంలోని చౌపన్